రంజాన్ వేళలు శనివారం(ఇఫ్తార్-6:38), ఆదివారం (సహెర్-4:45)

- ఆధునిక వ్యవసాయంలో కనిపించని సబ్సిడీ యంత్రాలు
- టార్పాలీన్ కవర్లు, విత్తనాలు కూడా..
- ఐదేళ్లుగా సబ్సిడీ పథకాన్ని ఎత్తేసిన ప్రభుత్వం
- సాగు భారమవుతుందంటున్న రైతులు

పడకేసిన యాంత్రీకరణ



వరి కోత మిషన్

ఆధునిక వ్యవసాయంలో రైతులకు యంత్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. యంత్రాలతో సాగుకు తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో పనులు పూర్తి చేయడమే కాకుండా వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. అందుకోసం ఉమ్మడి రాష్ట్రంలో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందించారు. ఈ పథకాన్ని తెలంగాణ ఏర్పడిన తరువాత కూడా 2017వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొనసాగించింది. ఆ తరువాత వ్యవసాయానికి సంబంధించిన ఏ పరికరాన్ని కూడా సబ్సిడీపై అందించడం లేదు.

పాలమూరు, ఏప్రిల్ 5 : ఆధునిక వ్యవసాయంలో భాగంగా గత ప్రభుత్వాలు 'వ్యవసాయ యాంత్రీకరణ' పథకాన్ని ప్రవేశపెట్టాయి. ఈ పథకంలో రైతులకు సబ్సిడీ పై వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, విత్తనాలు అందజేసేవారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ పై అందించడంతో సాగు ఖర్చు చాలా తక్కువయ్యేది. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన కొంతకాలానికి ఈ పథకాన్ని బంద్ చేశారు. 2016-17లో సబ్సిడీ ట్రాక్టర్ల కోసం 3వేలకు పైగా దరఖాస్తు చేసుకుంటే కేవలం మూడు వందల మందిని ఎంపిక చేశారు. దీంతో వచ్చిన దరఖాస్తులకు, మంజూరుకి పొంతన లేకపోవటంతో మంజూరైన ట్రాక్టర్లు ఎవరికి ఇవ్వాలనే దానిపై అధికారులు ఆరు నెలలపాటు తర్జన, భర్జన చేసి, చివరికి మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వారికే ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. నాటి నుంచి నేటివరకు యంత్ర పరికరాల ఊసే ఎత్తడం లేదు. 2022-23 వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించటంతో 'వ్యవసాయ యాంత్రీకరణ' పథకం అమలు చేస్తారని రైతులు ఆశించారు. కానీ అమలు చేయలేదు. దీంతో రైతులు తీవ్ర నిరాశ చెందారు. ప్రతీనిత్యం వ్యవసాయ పనుల్లో రైతులకు అధికంగా అవసరమయ్యే స్ప్రేయర్లు, టార్పాలీన్లను కూడా ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. దీంతో ప్రైవేట్‌లో కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతు న్నారు. రైతు బంధు అమలు చేసినప్పటి నుంచి ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించి యంత్ర పరికరాలను సబ్సిడీపై అందజేయాలని రైతులు కోరుతున్నారు.

కనిపించని కస్టమ్ హైరింగ్ సెంటర్లు

రైతులకు వరికోత యంత్రాలు కొనుగోలు చేయటం భారం అవుతుందని వ్యవసాయ పనిముట్లు అద్దెకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీ)ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అద్దె ఎంత ఉండాల్లో గ్రామ పంచాయతీ నిర్ణయించాలి. సీహెచ్‌సీల స్థాపనతో గ్రామీణ యువతకు ఉపాధి, రైతులకు కూలీల సమస్య సాగు వ్యయం, చాకీరి తగ్గుతుందని ప్రభుత్వం ప్రకటించింది. నేటికి ఈ సెంటర్ల జాడేలేదు. అక్కడక్కడ స్వయం సహాయక సంఘాలు కొన్ని యంత్రాలను అద్దెకిస్తున్నాయి. రాష్ట్ర విభాగ పథకం(ఎస్‌ఎస్‌ఎస్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకాలను ప్రభుత్వం అమలు చేయడంలేదు. వచ్చే వానాకాలం నుంచయినా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.



సబ్సిడీ పథకం అమలు చేయాలి

ప్రభుత్వం రైతులకు విత్తనాలు, యంత్రాల సబ్సిడీ పథకం అమలు చేయాలి. గతంలో కూరగాయల విత్తనాలతో పాటు స్ప్రే పంపులు, ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, కలుపుతీసే యంత్రాలు, టార్పాలిన్ కవర్లు సబ్సిడీపై ఇచ్చేవారు. రైతుబంధు, రైతు బీమా వచ్చిన తరువాత సబ్సిడీ మాటనే ఎత్తడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, విత్తనాలు అందించాలి.

- వెంకటేష్, హన్వాడ



ప్రభుత్వ పాలసీని అమలు చేస్తం

ప్రభుత్వ పాలసీని అధికారులు అమలు చేయాల్సిందే. ఏనాటినుంచో 'వ్యవసాయ యాంత్రీకరణ' పథకం అమల్లో ఉండేది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దానిని పక్కన పెట్టింది. గత ఏడాది నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. కానీ నిధులు విడుదల చేయకపోతే అధికారులం ఏం చేయగలం.

- బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి



వ్యవసాయ పరికరాలు

కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

- అప్పులు ఉన్నాయని తెలిసినా అలవికాని హామీలు
- రైతుల పంటలు ఎండిపోతుంటే రాజకీయాలపై దృష్టి
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



మాట్లాడుతున్న బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

మహబూబ్‌నగర్/మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్) : ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లా కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన బీజేపీ సత్యాగ్రహ దీక్షల్లో ఆమె ప్రసంగించారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని బీజేపీ ఎండగడుతుంటే అప్పులు ఉన్నాయని తెలిసి కూడా అలవికాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు భ్రమ కల్పించి అధికారంలోకి వచ్చిందన్నారు. రైతుల పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ పార్టీ దృష్టి రాజకీయాలపై మాత్రమే ఉన్నదని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన హామీ, రూ. 25 వేల పంట నష్ట పరిహారం, రైతు కూలీలకు రూ. 12 వేల భృతి, రైతులకు క్వింటాల్ ధాన్యంపై రూ. 500 బోనస్‌పై స్పందించడం లేదని విమర్శించారు. కర్ణాటకలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులకు నీళ్లు తీసుకువచ్చి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేలు నష్ట పరిహారం ఇస్తామని నేటికీ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలు అన్నీ అబద్ధమేనా అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 6 వేలు, సబ్సిడీపై రసాయన ఎరువులు, మందుల పిచికారికి డ్రోన్‌లను అందిస్తున్నదని అన్నారు. సేంద్రీయ వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తున్నది మోదీ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు డోకూరు పవన్ కుమార్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, అందె బాబాయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, క్రిష్ణ వర్ధన్‌రెడ్డి, పాండురంగా రెడ్డి, అంజయ్య, బుడ్డన్న, కిరణ్ కుమార్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, బాలత్రిపురాసుందరి, సాహితీరెడ్డి, పద్మవేణి, తదితరులు పాల్గొన్నారు.



ఎండ@43.3 డిగ్రీలు

- అడ్డాకుల, ధరూర్, వడ్డేపల్లిలలో 43.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత



భానుడి భగభగలకు వనపర్తి పట్టణంలోని మర్రికుంట సమీపంలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

మహబూబ్‌నగర్/గద్వాల/నాగర్‌కర్నూల్/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 5: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉష్ణోగ్రత నిప్పుల కొలిమిలా మారుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగు తుండటంతో ఎండవేడిమిని తట్టుకోలేక జనం అల్లాడుతు న్నారు. శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులలో 43.3 డిగ్రీల రికార్డ్ ఉష్ణోగ్రత నమోదైంది. దేవరకద్ర, గండీడ్ మండలాలలోనూ 43.1 డిగ్రీలు నమోదుకావడంతో జనం బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. బాలానగర్‌లో 42.7, చిన్నచింత కుంటలో 42.6, మిడ్జిల్‌లో 42.2 డిగ్రీలు నమోదుకాగా, మిగతా మండలాల్లో 40 నుంచి 41 డిగ్రీలుగా నమోదు కావడంతో జిల్లాలో వడగాలుల తీవ్రత పెరిగింది.

జోగుళాంబ గద్వాల జిల్లా జిల్లా అంతటా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ధరూర్, వడ్డేపల్లిలో 43.3 డిగ్రీలు నమోదైంది. కేటీదొడ్డిలో 42.8, ఇటిక్యాలలో 42.7, అయిజ లో 42.3, మల్దకల్‌లో 42.3, గద్వాలలో 42.2, రాజోలిలో 42, అలంపూర్‌లో 41.8, ఉండవెల్లిలో 41.7, గట్టులో 40.8, మానవపాడులో 40.6గా నమోదైంది. అదే సందర్భంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల నుంచి 27 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.

నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 42 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీలు నమోదైంది. చారకొండ మండలంలో 42.5 డిగ్రీలు, అచ్చంపేటలో 42.4, వంగూరులో 42.3, ఉప్పునుంతలలో 42.2, కోడేరులో 42.0, బల్మూరులో 41.9, వెల్దండలో 41.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి జిల్లాలో పెబ్బేరు మండలంలో అత్యధికంగా 42.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వనపర్తి, చిన్నంబావిలలో 42.4, పాన్‌గల్‌లో 41.8, పెద్దమందడిలో 41.5, ఘణపూర్, మదనాపూర్ 41.5, ఆత్మకూరు, అమరచింత, గోపాల్‌పేటలలో 41.4 డిగ్రీలు నమోదైంది. శ్రీరంగాపూర్‌లో 40.9, కొత్తకోటలో 40.6, వీపనగండ్లలో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 41 డిగ్రీలు గరిష్ఠంగా నమోదు కాగా, కనిష్ఠంగా 27 డిగ్రీలు నమోదయ్యాయి.



చల్లదనం కోసం సవాయిగూడెంలో కోళ్ల షెడ్‌పై గడ్డి పరిచిన యజమాని

సేద తీర చెట్టు నీడ

ఎండల తీవ్రతకు జనం, మూగజీవాలు అల్లాడుతున్నాయి.. ఉదయం 11 గంటలు దాటితే ఇళ్లలో ఉక్కపోతను భరించలేక వృద్ధులు చెట్ల నీడకు సేదతీరుతున్నారు.

అదేవిధంగా మేతకు వెళ్లిన గొర్రెలు, మేకలు, పశువులు చెట్ల కింద సేద తీరుతున్నాయి. కోళ్ల పెంపకందారు లు చల్లదనం కోసం కోళ్ల షెడ్లపైన గడ్డి వేసి నీటిని పిచికారి చేస్తూ కోళ్లను కాపాడుకుంటున్నారు.

ఈ దృశ్యాలు శుక్రవారం వనపర్తి జిల్లా సవాయిగూడెం వద్ద ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి



సవాయిగూడెంలో చెట్టు నీడకు సేదతీరుతున్న వృద్ధులు

వ్యక్తి దారుణ హత్య

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 5 : ఓ గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య కు గురయ్యాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి వెనకాల గొర్రెల వధశాల దగ్గర గురువారం రాత్రి చోటు చేసుకుంది. డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో జాగిలాలతో, క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. హత్యకు గురైన వ్యక్తి నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన దాసరి మారుతి (40)గా గుర్తించారు. అయన హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగించేవాడు. నాలుగు రోజుల క్రితం పట్టణానికి వచ్చాడు. అయితే రాత్రి అయనను గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో కొట్టి, నిప్పు అంటించి హత్యకు చేశారని, హత్యకు కారణాలు తెలియాల్సి ఉందని డీఎస్పీ తెలిపారు.



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

దైవ దర్శనానికి వెళ్తుండగా..
బొలెరో బోల్తా, ఇద్దరి మృతి

అయిజ, ఏప్రిల్ 5 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని ఉత్తనూర్ గ్రామ సమీపంలో శుక్రవారం దైవ దర్శనానికి వెళుతూ బొలేరో వాహనం బోల్తాపడిన సంఘటనలో ఇద్దరు మృతి చెందారు. కర్ణాటక రాష్ట్రంలోని ఇడుపునూర్, మిర్జాపూర్, జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన వారు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి 40 మంది వరకు బొలేరో వాహనంలో శుక్రవారం ఉదయం రాయలసీమలోని మద్దిలేటి స్వామిని దర్శించుకునేందుకు బయలుదేరారు. కర్ణాటక నుంచి సిందనూర్ గ్రామం మీదుగా ప్రయాణం సాగించారు. అయిజ మండలంలోని ఉత్తనూర్ గ్రామంలోని సబ్‌స్టేషన్ సమీపంలో గల మలుపు దగ్గరకు రాగానే వాహనం స్టీరింగ్ రాడ్ విరిగిపోవటంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన నాగప్ప, లక్ష్మి దంపతుల కుమారుడు మనోజ్(9) అక్కడికక్కడే మృతి చెందాడు. కర్ణాటకలోని మీర్జాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి నాగన్న (45)కు తీవ్ర గాయాలు కావటంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయారు. రంగప్ప అనే వ్యక్తి గాయాలతో కర్నూల్‌లో చికిత్స పొందుతున్నాడు. మిగతావారు స్వల్ప గాయాలతో ప్రథమ చికిత్స చేయించుకొని వెళ్ళారు. ఈ విషయమై అయిజ ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

- నేడే వనపర్తి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక
- ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం
- పురప్రజల్లో నెలకొన్న ఉత్కంఠ
- పుట్టపాగకే పట్టం అంటున్న కౌన్సిల్ సభ్యులు

పుర పీఠం ఎవరిదో?

వనపర్తి టౌన్, ఏప్రిల్ 5: పుర పీఠ ఎవరికి దక్కనున్నదో నేడు తేలనున్నది. మూడు నెలలుగా వనపర్తి మునిసిపాలిటీలో నెలకొన్న చిక్కుముడి వీడే సమయం ఆసన్నమైంది. ఎన్నో నాటకీయ పరిణామాల మధ్య నెలకొన్న సందిగ్ధతకు నేడు శుభం కార్డు పడనుంది. అప్పట్లో చైర్మన్, వైస్ చైర్మన్ తీరును వ్యతిరేకించి ముదిరిన ముసలంతో బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. దీంతో రంగంలోకి దిగిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. కానీ ఫలితం దక్కలేదు. చివరిగా వారికున్న రాజకీయ అనుభవంతో అవిశ్వాసం లేకుండా చేయగలిగారే కానీ, చైర్మన్, వైస్ చైర్మన్‌ల పదవులను మాత్రం కాపాడలేక పోయారు. ఎట్టకేలకు నేడు ఉదయం 11 గంటలకు వనపర్తి మునిసిపాలిటీకి కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక జరగనుంది.

నేరుగా క్యాంపు నుంచే...

కొత్త సభ్యుల ఎన్నిక సంగ్రామంలో వనపర్తి మునిసిపాలిటీలో రోజుకో మలుపు తిరగడంతో క్యాంపు రాజకీయాలకు దారి తీసింది. 25 మంది సభ్యులు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇద్దరు సభ్యులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల తరువాత బీజేపీ పార్టీకి చెందిన మరో ఇద్దరూ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం 9కి చేరింది. ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 8 మంది కౌన్సిలర్లు మార్చి 30న పార్టీకి రాజీనామా చేసి ఏప్రిల్ ఒకటిన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో కాంగ్రెస్ బలం 17కు చేరింది. అంతేకాకుండా టీడీపీలో ఉన్న ఒక్క కౌన్సిలర్ కూడా కాంగ్రెస్ పార్టీతోనే మొదటి నుంచి జత కట్టి ఉండటం, కొత్త సభ్యుల ఎన్నికలో ఎమ్మెల్యే ఓటు కూడా ఉండటంతో కాంగ్రెస్ పార్టీకే మునిసిపల్ పీఠం దక్కనుందనేది అందరికి తెలిసిన నిజం. కానీ రాజకీయంలో ఎప్పుడేమి జరుగుతుందో అనుకున్న కాంగ్రెస్ పార్టీ సభ్యులు ముందస్తు జాగ్రతగా 23 మంది సభ్యులను రెండు రోజుల క్రితం క్యాంపునకు తరలించారు. క్యాంపులో ఉన్న సభ్యులు నేడు (శనివారం) నేరుగా సమావేశానికి హాజరై కొత్త సభ్యులను ఎన్నుకోనున్నారు. 17 మంది సంఖ్యాబలం కావాల్సిన కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌లలో 13వ వార్డుకు చెందిన పుట్టపాగ మహేష్, 20వ వార్డుకు చెందిన పాకనాటి కృష్ణ పేర్లు చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా గత కొద్ది రోజులుగా వినిపిస్తున్నాయి. మరి కొద్ది గంటల్లో ఏమి జరగబోతుందో వేచి చూడాలి.



వనపర్తి మునిసిపల్ కార్యాలయం

సాహిత్య విలువల పెంపునకు దోహదం

▸▸ జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి


ఉగాది పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 5 : సాహిత్యం సమాజంలో భాషా వికాసానికి, సాహిత్య విలువలు పెంపొందించడానికి దోహదం చేస్తుందని జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్కౌట్స్, గైడ్స్ భవనంలో శుక్రవారం తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీక్రోధినామ సంవత్సరం సందర్భంగా ఉగాది కవి సమ్మేళనం ఉగాది పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మహిళా సాహిత్య సంస్థ సాహిత్య ఉపన్యాసాలు, కవి సమ్మేళనాలు, పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎందరికో మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సాహిత్యానికి కొదువలేదన్నారు. మహిళలు ముందుండి ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు. సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో మహిళా సాహిత్యానికి కొదువలేదని, సంస్థ నుంచి ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా నేడు సాహిత్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న సందాపురం బుచ్చయ్య (ప్రముఖ పద్యకవి) డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి (ప్రముఖ పద్యకవి)అల్వాల లక్ష్మణమూర్తి (ప్రముఖ పద్యకవి) సాయి మనస్విని (శాస్త్రీయ సంగీత గాయకురాలు) లకు ఉగాది పురస్కారాలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమార్ మాట్లాడుతూ సాహిత్య సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో కవులు తమ కవితలను చక్కగా వినిపించారు. చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి, అనంతరం పురస్కార గ్రహీతలకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో సి.శ్రీదేవి జి.శాంతారెడ్డి, అనురాధ, సక్కుబాయి, వల్లభాపురం జనార్దన్ ఖాజామైనుద్దీన్, జగపతిరావు, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

అయిజ, ఏప్రిల్ 5 : జోగుళాంబ గద్వాల జి ల్లా అయిజ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. కృష్ణారెడ్డి తన ఇంటికి తాళం వేసి పనిమీద కర్నూల్‌కు వెళ్ళారు. రాత్రి తిరిగి వచ్చి చూసే స రికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్ళి పరిశీలించగా రెండు లక్షల రూపాయలు, ఆరు తులాల బంగారం చోరీకి గురైందని గుర్తించారు. ఈ మేరకు సమాచారం ఇవ్వటంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వడ్డేపల్లి, ఏప్రిల్ 5 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని జూలకల్ శివారు లోని ఉత్తర ఫుడ్స్ సమీపంలో ఉన్న రాఘవరెడ్డి పొలంలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం (38) లభ్యమైనట్లు శాంతినగర్ ఎస్ఐ సంతోష్ తెలిపారు. మృతుడి వంటిపై నీలంరంగు డ్రాయ ర్, తెలుపు, గులాబి రంగు పంచె ఉందని, కుడి చేతికి రెండు వరుసల నల్లదారం ఉందని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

బాలానగర్, ఏప్రిల్ 5 : బాలానగర్ మండల కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీని బుధవారం చేస్తుండగా రూ.లక్ష నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ తిరుపాజి తెలిపారు. ఆధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాకు చెందిన నక్కగురు శేఖర్ నగదును తీసుకువెళ్తుండగా, అందుకు సంబంధించిన రసీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.


పట్టుబడ్డ నగదుతో పోలీసు

కుక్కల దాడిలో జింకకు గాయాలు


ఉండవల్లి పశువైద్యశాలలో వైద్యం అందిస్తున్న పశువైద్య సిబ్బంది, ఆటవీశాఖ సిబ్బంది

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 5 : కుక్కల దాడిలో ఓ జింక తీవ్రంగా గాయపడింది. సంఘటనపై అటవీశాఖ బీట్ ఆఫీసర్ కీర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులో శుక్రవారం జింకల మంద తిరుగుతుండగా కుక్కలు దాడిచేశాయి. ఓ జింక తీవ్రంగా గాయపడి ఉండటాన్ని రైతులు గమనించి అలంపూర్ చౌరస్తాలోని పోలీస్ అవుట్ పోస్టుకు తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న బీట్ ఆఫీసర్ కీర్తి, డ్రైవర్ విజయ్‌తో జీపులో అక్కడికి చేరుకున్నారు. జింకకు ఉండవల్లి పశు వైద్య శాలలో చికిత్స చేయించి, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర సమీపంలోని పిల్లలమర్రి అడవిలో వదిలేశారు.

తప్పిన ప్రమాదం

గండీడ్, ఏప్రిల్ 5 : కారు అదుపుతప్పి కిందపడిన ఘటనలో ప్రమాదం తప్పింది. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని రంగారెడ్డిపల్లి వాగు టర్నింగ్‌లో చోటు చేసుకున్న సంఘటన వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి 1 గంట సమయంలో మహబూబ్‌నగర్ నుంచి కోస్గికి కారులో వెళ్తుండగా రంగారెడ్డిపల్లి మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కకు కారు బోల్తాపడింది. కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో అందులోని వారికి ప్రాణాపాయం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. కారులోని వారికి స్వల్ప గాయాలు కావడంతో వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు.

బెల్ట్ షాపుపై దాడి, కేసు నమోదు

ఎర్రవల్లి, ఏప్రిల్ 5 : ఎర్రవల్లి మండల పరిధిలోని పుటాన్‌దొడ్డిలోని బెల్ట్ షాపుపై దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ స్వాతి తెలిపారు. 4.14 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడు బోగం నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తకోట, ఏప్రిల్ 5 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని అప్పరాల గ్రామానికి చెందిన జోకూర్ బాలస్వామి వారంరోజుల కిందట అదృశ్యమయ్యాడు. శుక్రవారం వడ్డెవాట గ్రామ శివారులోని దేవబండగుట్ట దగ్గరలో గుర్తు తెలియని శవం ఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్సై మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలానికి వెళ్లారు. శవాన్ని పరిశీలించగా అదృశ్యమైన బాలస్వామిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బాలస్వామి కుటుంబ సభ్యులు వచ్చి శవాన్ని పరిశీలించి, బాలస్వామిగా గుర్తించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 5 : ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం పర్వతాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ బొట్టు శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోపా లోపేట మంగమ్మ(49) ఆర్థిక ఇబ్బందులు, అప్పులు ఉన్న నేపథ్యంలో ఇంట్లో తరచూ గొడవలు జరిగేవి. గతంలోనూ ఈమె ఆత్మహత్యాయత్నం చేయగా ఇరుగుపొరుగు వారు రక్షించినట్లు తెలిపారు. శుక్రవా రం ఉదయం మృతురాలి కుమారుడు రాములు ఇంట్లో లేని సమయంలో ఉయ్యాల కొండికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించి, రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

బిజినేపల్లి, ఏప్రిల్ 5 : బైక్ అదుపు తప్పడంతో వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మహదేవునిపేటలోని కేఎల్‌ఐ బ్రిడ్జ్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన సంతోష్(38), మురళి బిజినేపల్లి మండలంలోని మమ్మాయిపల్లి గ్రామానికి సొంత పని మీద వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తుండగా మహదేవునిపేటలోని కేఎల్‌ఐ బ్రిడ్జ్ సమీపంలో రోడ్డుపై గుంతల్లో బైక్ అదుపుతప్పి కిందపడింది. దాంతో సంతోష్ తలకు తీవ్ర గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మురళిని 108లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రి చికిత్స కోసం తరలించారు. మృతుడికి భార్య పద్మ, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు పరీక్ష

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 5 : జిల్లాలోని ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 7న నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు చేసినట్లు డీఈవో రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి విద్యార్థుల హాల్‌టికెట్స్ ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. విద్యార్థుల హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశాలకు, 7 నుంచి 10 తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిలువెత్తు నిర్లక్ష్యం

▸▸ వ్యవసాయ మార్కెట్‌యార్డు నిర్వహణ లోపం అధికారులదే



దగ్ధమైన ధాన్యం

పెబ్బేరు, ఏప్రిల్ 5 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరిగిన భారీ అగ్ని ప్రమాదానికి వ్యవసాయ శాఖ, సివిల్ సప్లై అధికారుల నిర్లక్షమే కారణమని తేలింది. మార్కెట్ యార్డు గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. గోదాంలో దగ్ధమైన గన్నీ బ్యాగులు పూర్తిగా ఆరిపోవడానికి ఐదు రోజులు పట్టింది. మార్కెట్ యార్డు గోదాంలో కోట్లాది రూపాయల వరి ధాన్యం, గన్నీ బ్యాగులు నిల్వ ఉంచిన గోదాముల వద్ద నిర్వహణా లోపం కొట్టొచ్చినట్లు కనిపించింది. వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్వహణ కేవలం ఔట్ సోర్సింగ్ సిబ్బందితో నడుస్తోంది. అధికారులు ఎక్కడో ఉండి స్వంత పనులు చేసుకుంటూ ఫోన్ల ద్వారా మార్కెట్‌యార్డును నడిపిస్తున్నారు. అందుకు ఈనెల ఒకటో తేదీన జరిగిన అగ్ని ప్రమాదం ఉదాహరణ. మార్కెట్‌యార్డుకు పాలకవర్గం లేకపోవడం కూడా కారణంగా కనిపిస్తుంది. బాధ్యతతో పనులు నిర్వహించే వారే కనిపించడం లేదు.

సీసీ కెమెరాలు లేకపోవడం వల్లే..

పెబ్బేరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరిగిన భారీ అగ్ని ప్రమాదానికి కారణాలను గుర్తించడానికి ఇబ్బందిగా మారింది. మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు ఉండి ఉంటే ప్రమాదానికి గల కారణాలను కనిపెట్టే వారు. కోట్ల రూ పాయల ధాన్యం నిల్వ ఉంచిన గోదాముల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ముఖ్యంగా సెక్యూరిటీ ఏర్పాటు చేయకపోవడంలో కూడా అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుంది. గతంలో సెక్యూరిటీ గార్డులు ఉండేవారు. ప్రస్తుతం లేరు. మార్కెట్ యార్డు గోదాములను సివిల్ సప్లై అధికారులకు అద్దెకిచ్చామనే భావనతో మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోలేదు.

సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉండగా వారు నిర్లక్ష్యం చేయడం వల్లే భారీ ప్రమాదం జరి గింది. సివిల్ సప్లై అధికారులు ఎక్కడో ఉండి ఇద్దరు లేదా ముగ్గుర్ని అనధి కార అసిస్టెంట్లను ఏర్పాటు చేసుకొని వారికి ధాన్యం ఉన్న గోదాములు తాళాలు అప్పగించినట్లు తెలుస్తుంది. వారు కూడా మార్కెట్ యార్డులో ఉండకుండా మార్కెట్‌లో పనిచేసే ఓ హమాలీ సంఘం నాయకునికి తాళాలు ఇచ్చినట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన తరువాత అనధికార అసిస్టెంట్లను, హమాలీ సంఘం నాయకుడిని పోలీసులు విచా రిస్తున్నట్లు తెలుస్తుంది. వారి విచారణలో ఏం తేలుతుందో వేచి చూడాలి.



ఇంకా ఆరని పొగలు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

బస్టాండ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు మార్కెట్‌యార్డు ఆవరణలో మద్యం, గుట్కా, గంజాయితో పాటు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. గతంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి హత్యకు గురయ్యారు. దీనివల్ల దుర్గంధమైన వాసన వస్తున్నప్పటికి అధికారులు పట్టించు కోవడం లేదు. మదనాపురం మార్కెట్‌యార్డుకు సబ్ యార్డుగా ఉన్న పెబ్బేరు మార్కెట్ యార్డును గత ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి కల్పించి అభివృద్ధి చెందుతున్న తరుణంలో భారీ అగ్ని ప్రమాదం జరగడం దురదృష్టకరం.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 5 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని కంచుపాడు శివారులో జాతీయరహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. రంగారెడ్డి జిల్లా, కేశంపేట మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన కడమోని రాజేష్‌కు చెందిన టెంపో ట్రాక్కు మరమ్మతు కోసం బెంగళూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా కంచుకుపాడు శివారులో ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొన్నది. దీంతో డ్రైవర్ తిప్పలపల్లి రాజేష్ (36) అక్కడిక్కడే మృతి చెందాడు.

క్షుద్ర పూజలు చేస్తామని టోకరా

గోపాల్‌పేట, ఏప్రిల్ 5 : క్షుద్ర పూజలు చేసి మానసికంగా మంచిగా చేసామని నమ్మబలికి ఓ వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేసిన గుంటూరుకు చెందిన ముగ్గురిని రిమాండ్ చేసినట్లు సీఐ నాగభూషణరావు తెలిపారు. శుక్రవారం గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన కందూరు రాజు తన కుమారుడు వెంకటేష్ మానసికంగా వ్యాధితో బాధపడు తున్నాడు. ఎన్ని ఆసుపత్రులు చూపించినా ఫలితం లేకుండా పోయింది. ఒకరోజు మొబైల్‌లో రీల్స్ చూస్తుండగా మానసికంగా లేని వారికి బాగు చేస్తామని రీల్ చూశాడు. దీంతో రాజు వారికి ఫోన్ చేసి తన కుమారుడి పరిస్థితిని గుంటూరుకు చెందిన సిరిగిరి గోపి, సిరిగిరి వెంకన్న, మన్యంలకు వివరించాడు. అదునుగా భావించిన మాంత్రికులు రాజు స్వగృహంలో క్షుద్రపూజలు నిర్వహించి, రెండుసార్లు విజయవాడకు పిలిచి క్షుద్ర పూజలు జరిపించారు. రాజు నుంచి విడతల వారీగా రూ.తొమ్మిది లక్షల 73 వేలు తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా కుమారుడిలో మార్పు లేకపోవడంతో రాజు వారికి ఫోన్ చేశారు. ఎన్నిసార్లు ఫోన్ చేసిన వారి నుంచి స్పందన రాకపోవడంతో మోసపోయానని గ్రహించి గతనెల 20వ తేదీన పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఎస్సై హరిప్రసాద్, తన టీం విజయవాడలోని నిందితులను గోపి వెంకన్న, మన్యంలను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వీరి నుంచి రూ.ఏడు లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. నిందితులను పట్టుకోవడానికి సహకరించిన ఎస్సై హరి ప్రసాద్ కానిస్టేబుల్ వంశీ, అంజి, రాజేష్‌లను సీఐ అభినందించారు.

నేటికీ రుణమాఫీ చేయలేదు

▸▸ బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

▸▸ స్థానికుడిని గెలిపించుకొందాం : మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట, ఏప్రిల్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతున్నా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని బీకే ప్యాలెస్ ఫంక్షన్ హాలులో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా గువ్వల మాట్లాడుతూ స్థానికుడిని గెలిపించుకొని స్థానికేతరులను తరిమికొడదామని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటిది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం మనదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి వందరోజులు అవుతున్నా నేటికి అమలు చేయలేదన్నారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారం పొంది ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే పోలీస్‌స్టేషన్ ముందు ధర్నాలు చేస్తామన్నారు. తన గెలుపు కోసం ప్రతీ కార్యకర్త ఓ సైనికుడిలా కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రంగినేని అభిలాస్ రావు, మునిసిపల్ ఛైర్మన్ నరసింహగౌడ్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మైనింగ్ చేపడితే ఊరుకునేది లేదు

బల్మూరు, ఏప్రిల్ 5 : మైనింగ్ పనులు చేపడితే ఊరుకునేది లేదని గ్రామస్థులు హెచ్చరించారు. మండల పరిధిలోని మైలారం గ్రామానికి ఆనుకుని ఉన్న సర్వే నెంబరు 120లో గుట్టపై మైనింగ్ పనులు చేపట్టేందుకు వాట్స్ మైనింగ్ డైరెక్టర్ వేణు శుక్రవారం వచ్చారు. దాంతో గ్రామస్థులు అధిక సంఖ్యలో గుట్ట సమీపంలోని శివాలయం ప్రాంగణానికి చేరుకున్నారు. మైనింగ్ అధికారులు గుట్టపైకి వెళ్లడానికి రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తుండటంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మైనింగ్ కాంట్రాక్టర్‌కు, ప్రజలకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో అచ్చంపేట సీఐ రవీందర్, ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో పోలీసులు చేరుకుని ప్రజలను నచ్చజేప్పే ప్రయత్నం చేశారు. అయినా ప్రజలు వినిపించుకోలేదు. తమ ప్రాణాలు పోయినా సరే పనులను జరగనివ్వబోమని హెచ్చరించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న గుట్టను మైనింగ్ తీస్తే తమ ఇళ్లు పూర్తిగా ధ్వంసమవుతాయని ప్రజ లు ఆందోళన వ్యక్తం చేశారు. తాము కోర్టుకు వెళ్లి స్టే తీసుకొస్తామని ఇక్కడ మైనింగ్ పనులు చేపట్టకూడదని గ్రామస్థులు స్పష్టం చేశారు. దీంతో చేసేది లేక కాంట్రాక్టర్లు వెనుదిరిగారు.



మైలారం గుట్ట సమీపంలో మైనింగ్ అధికారులతో ఘర్షణకు దిగుతున్న గ్రామ ప్రజలు

మైలారం వెళ్తున్న నాయకులను అడ్డుకున్న పోలీసులు

అచ్చంపేట : బల్మూరు మండలంలోని మైలారం గ్రామంలో శుక్రవారం అక్రమంగా జరుగుతున్న మైనింగ్ పనులను గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్థులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను వంటిమామిడి సమీపంలో అచ్చంపేట, బల్మూరు పోలీసులు అడ్డుకొని అచ్చంపేట పట్టణానికి తరలించారు.

మద్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 5 : ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో 272 లీటర్ల మద్యాన్ని పట్టుకొని తమకు అప్పగించినట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఇటిక్యాల మండల పంచాయతీరాజ్ ఏఈ పాండురంగ సిబ్బందితో కలిసి జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. నరేష్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన 232 లీటర్ల మద్యం లభించింది. అలాగే బీర్బరి అలియాస్ చిన్నా అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బుడిదపాడు చౌరస్తా మీదుగా కర్నూల్ వైపు వెళ్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. ఆయన వద్ద 39.42 లీటర్ల మద్యం పట్టుబడింది. దాని విలువ రూ. 1.16 లక్షలుగా నిర్ధారించి, ఇద్దరు నిందితులపై ఉండవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న పదో తరగతి మూల్యాంకనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 5 : పదవ తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో శుక్రవారం మూడు రోజులుగా ప్రశాంతంగా కొనసాగుతోంది. డీఈవో రవీందర్, పరీక్షల విభాగం అధికారి కమలాకర్‌రావు, సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలు తదితరుల పర్యవేక్షణలో ప్రశాంతంగా సాగుతోంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం సాగుతుంది.

ప్రధానోపాధ్యాయుడి సేవలు మరువలేనివి..

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా గండీడ్ మండలం వెన్నాచేడ్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న శంకరయ్య సేవలు మరువలేనివని డీఈవో రవీందర్ అన్నారు. గత నెల 31న పదవీ విరమణ పొందిన జీహెచ్ఎం శంకరయ్యను మూల్యాంకన కేంద్రంలో డీఈవో రవీందర్, పరీక్షల విభాగం అధికారి కమలాకర్‌రావు, సెక్టోరియల్ అధికారులు బైకాని బాలు యాదవ్, దుంకుడు శ్రీనివాస్, జీహెచ్ఎంలు, ఎంఈవోలు పూలమాల, శాలువాలతో సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 5 : జేఈఈ మెయిన్స్-2 ప్రవేశ పరీక్ష శుక్రవారం కూడా ప్రశాంతంగా కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌సీఈ, ఫాతిమా విద్యాలయంలో నిర్వహించారు. ఈ పరీక్షకు ఫాతిమా విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 147 మంది హాజరుకావాల్సి ఉండగా 135 మంది విద్యార్థులు హాజరుకాగా 12 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 147 మందికి గాను 134 మంది హాజరుకాగా 13 మంది విద్యార్థులు హాజరుకాలేదు. జేపీఎన్‌సీఈలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో 180 మందికి గాను 159 మంది హాజరుకాగా 21 మంది హాజరు కాలేదు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 180 మంది విద్యార్థులకు గాను 162 మంది హాజరుకాగా 18 మంది హాజరుకాలేదు.

గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఏప్రిల్ 5 : జిల్లాలోని గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యవిజ్ఞాన సదస్సుకు ఆయనతో పాటు మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ చల్లా వంశీచంద్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో గ్రామీణ వైద్యులను వైద్యాధికారులు ఇబ్బందులకు గురిచేశారని, ఇకపై అలాంటి ఇబ్బందుల్లేకుండా తమ వృత్తిని ప్రశాంతంగా కొనసాగించుకునేలా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తుందన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆర్ఎంపీల భవనం కోసం రూ. 10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ముఖ్య అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు శ్రవన్‌కుమార్, సురేందర్, నర్సింహారావు, సిద్ధేశ్వర్, శివప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో జుమాతుల్ విద



జిల్లా కేంద్రంలోని జామా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 5 : రంజాన్ మాసంలో ఆఖరి శుక్రవారం జుమాతుల్ విదాను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మసీదుల్లో మధ్యాహ్నం 1:30 గంటలకు నమాజ్ ఆచరించారు. పవిత్ర రంజాన్ మాసంలో చివరి శుక్రవారానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. భక్తి శ్రద్ధలతో వేలాదిమంది ముస్లింలు నమాజ్ నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తూర్పుకమాన్ వద్ద ఉన్న జామా మసీదులో హాఫీజ్ మహ్మద్ ముజాహెద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 5 : ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమని కౌరంపేట మదర్సాకు చెందిన ప్రముఖ ధార్మికవేత్త మౌలానా తస్లీమ్ అన్సారీ అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని మసీదుల్లో షబ్-ఎ-ఖదర్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎదిర 4వ వార్డు జామా మసీదులో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని ధార్మిక సందేశం ఇచ్చారు. పవిత్ర ఖురాన్ అవతరించిన రంజాన్ మాసంలో మన పాపాలను క్షమించాలని అల్లాను వేడుకోవాలని తెలిపారు. ప్రవక్త చూపిన మార్గం అనుసరిస్తూ పేదలకు తమ వంతు సహాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌హకీం, కోశాధికారి అబ్దుల్‌అజీజ్, హాఫెజ్ ఫెరోజ్, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో షబ్-ఎ-ఖదర్

మిడ్జిల్(మహబూబ్‌నగర్), ఏప్రిల్ 5 : జడ్చర్ల పట్టణంలోని తాజ్‌మజీద్‌లో గురువారం రాత్రి షబ్-ఎ-ఖదర్ వేడుకలను హజ్రత్ సుల్తాన్‌వుద్దీన్ చిస్తి, మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రంజాన్‌మాసంలో తరావిలో ఖురాన్ పఠనం చేసిన హాఫీజ్, అబ్రార్, ఇమామ్ షఫీక్‌లను, మజీద్‌లో సేవలు అందించిన సయ్యద్ బుర్‌హా, సయ్యద్ బషీర్ అహ్మద్‌లను సన్మానించారు. రఫీక్‌తో పాటు పలువురు నాతియాగేయాలను ఆలపించారు. కార్యక్రమంలో సలావుద్దీన్‌ఇర్ఫాన్, ముద్దీన్, జియావుద్దీన్, మహమ్మద్ రఫీక్, ముస్తఫా ఉన్నారు.

కార్యకర్తలు కష్టపడి పని చేయాలి

- మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నూతి శ్రీకాంత్‌గౌడ్



ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను సత్కరిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 5 : పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ కన్వీనర్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయనకు ఓబీసీ సెల్ నాయకులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. పార్లమెంట్ ఎన్నికలో ఓబీసీ సెల్ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, నాయకులు ఎన్‌పీ వెంకటేశ్ పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షులు బండి మల్లేశ్, నాయకులు పవన్‌గౌడ్, తిరుపతయ్య, లక్ష్మణ్‌యాదవ్, కుమార్ పాల్గొన్నారు.

మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

- నేటి రైతు దీక్షను విజయవంతం చేయాలి - జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య



మాట్లాడుతున్న జడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య

మిడ్జిల్ (మహబూబ్‌నగర్), ఏప్రిల్ 5 : రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక తీరా ప్రజలను మోసం చేస్తున్నదని జడ్పీవైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య అన్నారు. శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరవీందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పాలాది రామ్మోహన్‌లతో కలిసి జడ్పీవైస్ చైర్మన్ యాదయ్య విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి సి. లక్ష్మారెడ్డి పిలుపుమేరకు శనివారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం ముందు రైతు దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు, పార్టీ నాయకులు తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రణీల్‌చందర్, ఇంతియాజ్, మురళి, విజయ్ ఉన్నారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి : బీఆర్ఎస్

కోయిలకొండ, ఏప్రిల్ 5 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నారాయణపేటలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృష్టి పెట్టాలి

- ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకురాలు మమత

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 5 : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృష్టి పెట్టాలని, ఫీజురీయంబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకురాలు మమత డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవనంలో ఎస్ఎఫ్ఐ 41వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఎగురవేసి, మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ రాష్ట్రంలో వసతిగృహాలకు నిధులు సరిగా రాక డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు సరిగా విడుదల చేయలేదని అన్నారు. సమావేశంలో విద్యారంగ సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎస్ఎఫ్ఐ మాజీ ఉపాధ్యక్షులు రాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు భరత్, ఉపాధ్యక్షులు ఈశ్వర్, రాధిక, నందు, రాము, సరిత, ప్రసన్న, శ్రీనాథ్ పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాల వేస్తున్న కలెక్టర్ రవినాయక్



దమగ్నాపూర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా



నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్(ఆర్ఆర్)శ్రేణులు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

బహుజనుల అభ్యున్నతే...

బాబూ జగ్జీవన్‌రామ్ ధ్యేయం

- ఆయన ఆశయాలు కొనసాగిద్దాం

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 5 : బహుజనుల అభ్యున్నతికి తన జీవితాన్ని అర్పించిన గొప్ప యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త బాబూజగ్జీవన్‌రామ్ అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ఆయన హాజరై జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. భారత దేశ పునర్నిర్మాణంలో ప్రతిభావంతమైన పాత్రను పోషించారని గుర్తు చేశారు. జగ్జీవన్‌రామ్ భారత దేశ తొలి ఉపప్రధానిగా ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్, సీజే బెనహర్, నాయకులు సాయిబాబా, లింగం, సామ్యూల్, డాక్టర్ రామ్మోహన్, లయన్ నటరాజ్, రాములు, ఎన్‌పీ వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రి, అమరేందర్‌రాజు, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

బాబూజగ్జీవన్‌రామ్‌కు కలెక్టర్ నివాళి

బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌లు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పాండు తదితరులు పాల్గొన్నారు.

జనరల్ ఆసుపత్రిలో....



జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైద్యులు, ఆసుపత్రి అధికారులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి

పాలమూరు : సమాజంలోని దళితులు, గిరిజనులపై అత్యాచారాలు, దాడులు, హత్యలు జరగకుండా ఉండటమే బాబు జగ్జీవన్‌రామ్ ఆశయమని వివిధ దళిత సంఘాల నాయకులు అన్నారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కుర్మయ్య ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిర్వహించారు. పలు సంఘటనల్లో బాధితులుగా ఉన్నవారికి నేటికీ సహకారం అందడంలేదన్నారు. కార్యక్రమంలో ఆది విష్ణు, శ్రీను, రవి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ (రాయికంటి రాందాసు), ఎంఈఎఫ్‌ల ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగ గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఆయన పూలమాలవేసి నివాళి అర్పించారు. డప్పులు వాయిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాయికంటి రాందాసు, సింగిరెడ్డి పరమేశ్వర్, అశోక్, ఎల్.రమేష్ పాల్గొన్నారు.

● టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో : టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బోయపల్లి నరసింహులు, మామిడి సామెల్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో గల బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

● బహుజన మహనీయుల శోభాయాత్ర ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాతపాలమూరులో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పి.రమేష్, సింగిరెడ్డి పరమేశ్వర్, ఎం.డి. హనీఫ్‌అహ్మద్, టీఎఫ్‌టీయూ ఎస్.ఎం ఖలీల్, బుద్ధిస్ట్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

● విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో : జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ ఆవరణలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్.ఈ వి.వెంకటరమేష్, డీఈటీ పి.చంద్రమౌళి, కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో నివాళి అర్పిస్తున్న విద్యుత్ సంస్థ ఉద్యోగులు

● ఎమ్మార్పీఎస్(మందకృష్ణ), ఎంఈఎఫ్‌ల ఆధ్వర్యంలో : తెలంగాణ చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కావలి కృష్ణయ్య, పోలే బాలయ్య, కొండయ్య వెంకటస్వామి, బాలరాజు, రామస్వామి, రామ్మోహన్ పాల్గొన్నారు.

● మాదాసి, మాదారి కురువ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాదాసి, మాదారి కురువ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధన్వాడ రాములు, మాదాసి కురువ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కత్తి విజయభాస్కర్, గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్, జగదీష్ గడ్డం భరత్‌బాబు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట మండలంలో..

చిన్నచింతకుంట : మండలంలోని ఆయా గ్రామాల్లో బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని జరుపుకున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిలు దమగ్నాపూర్ గ్రామంలో జగ్జీవన్‌రామ్ జయంతిలో పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. మండల కేంద్రంలోని గాంధీవిగ్రహం ఎదుట వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. చింతకాయల శంకరయ్య, కుర్వ రమేష్ కార్యక్రమంలో మాట్లాడారు.

మిడ్జిల్ మండలంలో..

మిడ్జిల్ (మహబూబ్‌నగర్) : బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం కన్వీనర్ బాలయ్య, నాయకులు వెంకటయ్య, దేవరాజు, దానయ్య, భీంరాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

బాలానగర్ మండలంలో....

బాలానగర్ : అంబేడ్కర్ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాలులర్పిస్తున్న దృశ్యం

బాబుజగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, జంగయ్య, గొబ్రియనాయక్, యాదయ్య పాల్గొన్నారు.

దేవరకద్ర మండలంలో...

దేవరకద్ర : నియోజకవర్గంలోని దేవరకద్ర, కౌకుంట్ల, మండలాల్లోని గ్రామాల్లో శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి జరిపారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆయన చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కోయిలకొండ మండలంలో..

కోయిలకొండ : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బాబూ జగ్జీవన్‌రావు జయంతి దళిత సంఘాల నాయకులు శుక్రవారం నిర్వహిం చారు. మండల నాయకులు జి.రాజశేఖర్ బాబు జగ్జీవన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశానికి జగ్జీవన్‌రావు చేసిన సేవల ను ఎప్పటికీ మరిచిపోలేమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలరా జు, మొగులయ్య, వెంకటయ్య వడెన్న, కుర్మయ్య సాయన్న పాల్గొన్నారు.

రాజాపూర్ మండలంలో...

రాజాపూర్ : ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా గ్రామ పంచాయతీలలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

హన్వాడ మండలంలో...

హన్వాడ : మండలంలోని పెద్దదర్పల్లి గ్రామంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రావు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి రమాదేవి, బీజేపీ మండల నాయకుడు రఘురాంగౌడ్, మాజీ సర్పంచి వెంకన్న, గ్రామ పెద్దలు, మహిళ సంఘల సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

గండీడ్ మండలంలో..

గండీడ్ : బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ప్రభునాయక్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మైపాల్ గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బాబూజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలులు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి కృష్ణ, వెంకటయ్య, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల నివాళి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ మహమ్మదాబాద్ : పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ్‌గౌడ్, రఘురామ్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఘన నివాళి అర్పించారు. అదేవిధంగా బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.కృష్ణుడు, జిల్లా నాయకులు గురుప్రసాద్, రాములు నివాళ్లు అర్పించారు. తెలంగాణ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌బాబు, ప్రధాన కార్యదర్శి రమకాంత్ తదితరులు నివాళ్లు అర్పించారు. మహమ్మదాబాద్ మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పలువురు నాయకులు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. మాజీ ఎంపీపీ శాంతి రంగ్యా పాల్గొన్నారు.



హన్వాడలో నివాళి అర్పిస్తున్న నాయకులు



నివాళ్లు అర్పిస్తున్న పీఆర్టీయూ, బీసీటీఏ నాయకులు



జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

మాదిగలకు ఒక్కసీటూ ఇవ్వని కాంగ్రెస్‌ను ఓడిస్తాం

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన

మిడ్జిల్, ఏప్రిల్ 5 : రాష్ట్రంలోని 85 లక్షల మంది ఉన్న మాదిగలకు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలో ఒక్క సీటు కేటాయించలేదని, అందుకు ఎంపీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేలకు నిరసనగా కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మాదిగల ఓట్లతో గెలిచి, పార్లమెంట్ ఎన్నికలో ఎన్నికలో పోటీచేయడానికి అర్హులైన మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. నిన్న మొన్న కాంగ్రెస్ పార్టీని తిట్టిన వారికి టికెట్లు కేటాయించడంపట్ల మాదిగ సామాజిక వర్గాన్ని చిన్నచూపు చూడటమేనన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్తే అడుగడుగునా అడ్డుకొని ఓటే ఆయుధంగా వినియోగించుకొని తగిన బుద్ధిచెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు డి. కృష్ణయ్య, పోలె బాలయ్య, వెంకటస్వామి, టైగర్ జంగయ్యమాదిగ, దగ్గుల బాలరాజు, కరాటే శ్రీను, కావలి సత్యం, భీంరాజు, విజయ్, రవీందర్, సాయులు, రాజు, శివ, యాదయ్య రామస్వామి, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

18న ద్వారకా సాయి మందిరంలో 16వ వార్షికోత్సవం

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 5 : ఈ నెల 18న స్థానిక జిల్లా పరిషత్ సమీపంలోని ద్వారకా సాయి మందిరంలో 16వ వార్షికోత్స కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రధాన పూజారి హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాన్యాస పూర్వక అష్టోత్తర శతక్షీర కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులతో బాబాకు అభిషేకం చేయిస్తారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బాబా దివ్య అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. అభిషేక రుసుం రూ. 120 ఉంటుందని తెలిపారు.

కోయిల్‌సాగర్‌లో 14 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర, ఏప్రిల్ 5 : మండలంలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో 14 అడుగుల వద్ద నీటినిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.5 అడుగులు కాగా శుక్రవారం సాయంత్రం నాటికి 14 అడుగులకు చేరింది. ప్రాజెక్టు నుంచి ఐదవ విడత నీటి విడుదల నిలిపివేయగా తాగునీటి అవసరాలకు వదులుతున్నట్లు తెలిపారు.

పండుగలు ఐక్యతకు ప్రతీక

- ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, ఏప్రిల్ 5 : పండుగలు ప్రజల ఐక్యతకు ప్రతీకలు అని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జామియా మసీద్ దగ్గర మాజీ కో-ఆప్షన్ ఫారుక్‌అలీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో నిష్టతో ఉపవాస దీక్షలు ఆచరిస్తారన్నారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మండల నాయకులు అంజద్‌అలీ, వాయిద్‌అలీ, మహిమూద్, షఫీ, నాయకులు పాల్గొన్నారు.

వాడియాల మజీద్‌లో...

మిడ్జిల్ (మహబూబ్‌నగర్), ఏప్రిల్ 5 : మండలంలోని వాడియాల గ్రామంలోని మజీద్‌లో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జి. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. అంతకు ముందు విజయ్‌కుమార్ ముస్లింలతో కలిసి మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలకు ఖజూరా తినిపించి రోజాను విడిపించారు. ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు విజయ్‌కుమార్‌ను ముస్లీం సోదరులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు సమ్మద్‌పాషా, షబ్బీర్, మాసుంబాబా, ఇమ్రాన్, గోరెమియా, సత్తార్, రజాక్, గౌస్, ఖాజామైనుద్దీన్, సుకుర్‌ఖాజా ఉన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ

మహమ్మదాబాద్, ఏప్రిల్ 5 : మండల పరిధిలోని శేఖ్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు శుక్రవారం శిక్షణ ఫౌండేషన్ వారు విద్యార్థుల తాగునీటి కోసం వాటర్‌ఫిల్టర్‌ను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి శిక్షణ ఫౌండేషన్ కోఆర్డినేటర్ అశోక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యారులకు తమ ఫౌండేషన్ ద్వారా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు డీకే అరుణ పర్యటన

కోయిలకొండ, ఏప్రిల్ 5 : మండల కేంద్రంలో శనివారం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పర్యటిస్తారని ఆ పార్టీ మండల నాయకులు మధుసూదనరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించి, సభలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని బీజేపీ నాయకులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

ఉదారత చాటుకున్న ఆయుర్వేదిక్ డాక్టర్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఏప్రిల్ 5 : ఆయుర్వేదిక్ డాక్టర్ లావణ్య తన ఉదారత చాటుకున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ నిరుపేద రోగికి రూ. 10వేల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. డాక్టర్ లావణ్య చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి నిరుపేద రోగులకు ఆమె ఉచితంగా మందులు అందజేస్తున్నారు. అందులో భాగంగానే జిల్లా కేంద్రానికి చెందిన ముఖ్దీర్ అనే యువకుడు పక్షవాతానికి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న డాక్టర్ లావణ్య రూ. 10వేలు విలువ చేసే మందులను ఆ బాధితుడికి ఉచితంగా అందజేశారు. బయటి మార్కెట్‌లో ఈ మందుల విలువ రూ. 15వేల వరకు ఖర్చు అవుతుంది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, నాగిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నేడు మోదీపూర్ అంజన్న జల్దీ ఉత్సవం

కోయిలకొండ, ఏప్రిల్ 5 : మండలంలోని మోదీపూర్‌లో ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు శనివారం నిర్వహిస్తామని నిర్వాహకులు రవి తెలిపారు. ఉదయం స్వామి వారి దేవాలయం నుంచి సమీపంలోని వాగు వరకు పల్లకి సేవ నిర్వహించి వాగులో జల్దీబిందెకు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ నుంచి అంజన్న దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పూజలు నిర్వహిస్తామని తెలిపారు.